క్లుప్తంగా

పేద యువతి పెళ్లికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నిరంజన్

మల్కాజిగిరి: తల్లిదండ్రులు లేని ఆడపిల్ల పెళ్లికి చేయూత అందించారు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు. వినాయకనగర్‌కు చెందిన స్వాతికి తల్లిదండ్రులు లేరనే విషయాన్ని టీఆర్‌ఎస్ నియోజకవర్గ మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రూ.20 వేలు, నిరంజన్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. సురేష్, బాలక్రిష్ణ, ఫరీద్, చంద్రకాంత్, యాదగిరి ఉన్నారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించండి

కుషాయిగూడ: మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలోని మంగాపురం కాలనీలోని బాక్స్‌డ్రైన్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, స్థానిక నేతలు అశోక్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డికి పరామర్శ



సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

కుషాయిగూడ: ప్రమాదంలో గాయపడిన చర్లపల్లి డివిజన్ శుభోదయనగర్ కాలనీకి చెందిన సురేష్‌రెడ్డిని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవీ, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య పరామర్శించారు. కార్యక్రమంలో నాగేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దీపాన్ని తాకిన పావురం.. ఇంట్లో చెలరేగిన మంటలు

అల్వాల్: దీపం కిందపడి ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సప్తగిరి కాలనీలోని లక్ష్మీ ప్రసన్న అపార్ట్‌మెంట్‌లో నివసించే నరేష్ కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో దీపం వెలిగించి బయటకు వెళ్లాడు. ఓ పావురం దీపానికి తగలడంతో దీపం కింద పడింది. అక్కడే ఉన్న బట్టలకు మంటలు అంటుకోవడంతో పాటు ఇంట్లోని సోఫా, ఇతర ఫర్నిచర్‌కు మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న నరేష్‌కుమార్ కుమారుడు తరుణ్ బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది. పక్కన ఉన్న ఆరు ఫ్లాట్లను ఖాళీ చేయించారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామంతాపూర్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. సామాజిక విలువల్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, నెహ్రూ కళాశాల ప్రిన్సిపల్ వినయ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం


- శంకుస్థాపన వేసి నాలుగు నెలలు పూర్తి
- అస్తవ్యస్తంగా దత్తాత్రేయనగర్ రోడ్డు
- అవస్థలు పడుతున్న కాలనీలవాసులు
- త్వరగా రోడ్డు వేయాలంటున్న ప్రజలు



గుంతలమయంగా దత్తాత్రేయనగర్ రోడ్డు



శిలాఫలకం



మల్లాపూర్: ఆ రహదారి అస్తవ్యస్తం.. అటువైపు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవు.. గుంతలమయమైన రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులకు ఆందోళన తప్పదు. రాత్రి వేళలో మరింత అవస్థలు పడాల్సిన దుస్థితి. గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. కాలనీల ప్రజలు రోడ్డు వేయాలంటూ విన్నవించడంతో శంకుస్థాపన చేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని చాణిక్యపురి కాలనీ నుంచి దత్తాత్రేయనగర్‌కు రోడ్డు పనులకు ప్రజాప్రతినిధులు 2022 నవంబర్ 26న శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి నాలుగు నెలలు గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దత్తాత్రేయనగర్ కాలనీ మూలమలుపు గుంతల రోడ్డులో ట్యాంకర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు.

ప్రమాదకరంగా.. గుంతల రోడ్డు..

మల్లాపూర్ బాబానగర్, శక్తిసాయినగర్, దత్తాత్రేయనగర్, గోకుల్‌నగర్, ఎఫ్‌సీ, మల్లాపూర్ పారిశ్రామికవాడకు ఇది ప్రధాన రహదారి, నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగడునా గుంతలతో వివిధ పనులపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు.

పేరుకేనా శంకుస్థాపనలు..

హడావుడిగా రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి వెళ్లిపోయారని ఇప్పటి వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కోసం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో కాలనీవాసులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

“ త్వరగా పనులు పూర్తి చేయాలి

దత్తాత్రేయనగర్ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి. కాలనీవాసులు ప్రమాదాలకు గురవుతున్నాం. రోడ్డుపై నరకం అనుభవిస్తున్నాం. మాలాంటి సామాన్యులకు ఈ సమస్య తీవ్రత తెలుస్తుంది. అసంపూర్తిగా వదిలేసిన డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– వెంకట్‌రెడ్డి, దత్తాత్రేయనగర్ కాలనీ అధ్యక్షుడు.

“ ఈ నెల ఆఖరి వరకు పనులు పూర్తి

రోడ్డు పనులను ఈ నెల ఆఖరి వరకు పూర్తి చేస్తాం. వాటర్, స్టామ్ వాటర్‌లైన్, భూగర్భ డ్రైనేజీ పనుల వల్ల కొంచెం ఆలస్యం అయ్యింది. జేసీబీతో మట్టిని చదును చేస్తున్నాం. త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం. కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– స్రవంతి, మల్లాపూర్ ఏఈ



ఉల్లాసంగా ఉత్సాహంగా..

అల్వాల్‌లోని లయోలా అకాడమీ, డిగ్రీ, పీజీ కళాశాల 44వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. - అల్వాల్

గెలుపు సంబురాలు

మల్లాపూర్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంతో మల్లాపూర్‌లో బీజేపీ నేతలు మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, సతీష్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, దొడ్డి యాదగిరి, వెంకటేష్, రాములు నాయక్, తునికి గణేష్, పవన్, రామయ్య తదితరులు ఉన్నారు.



మల్లాపూర్‌లో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు

పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



చెక్కు అందజేస్తున్న పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి

మేడిపల్లి: వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వాసులకు 26 డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి వైద్యం ఖర్చుల నిమిత్తం పి.సరితకు రూ.30 వేలు, బి.స్వర్ణలతకు రూ.17,500, ఇ.సరస్వతికి రూ.60 వేల చెక్కులను సోమవారం వారికి అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

మేడిపల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బోడుప్పల్ రాఘవేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న కె.నరేశ్(32) 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం అతడి భార్య భవానీ మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మసీదు ప్రారంభోత్సవం



అల్వాల్: కొకూర్‌లో నూతనంగా నిర్మించిన మసీద్-ఏ-మహ్మదియాను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శుక్రవారం ప్రారంభించారు.

బీసీ మోర్చా అధ్యక్షుడిగా వర్కల శ్రీకాంత్



బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన వర్కల శ్రీకాంత్ భారతీయ జనతా పార్టీ బోడుప్పల్ బీసీ మోర్చా అధ్యక్షుడిగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ చేపట్టబోయే ప్రతి కార్యక్రమంలో పాల్గొని పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు



మేడిపల్లి: మేడిపల్లి పీఅండ్‌టీ కాలనీ 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు మేడిపల్లిలోని అన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మేడిపల్లి విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ మేడిపల్లి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. భరత్‌పురి కాలనీ, వీజీ కాలనీ, మారుతినగర్, పంచవటి కాలనీ, ఓంవిహారిక కాలనీ, విహారిక కాలనీ, కాకతీయ కాలనీ, ధరణి కాలనీల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

చిలుకానగర్ ఎస్సీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పార్నంది నర్సింగరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మొగిలిపాక రాచందర్, ఉపాధ్యక్షుడు పాలమకుల పరుశురాములు, కోశాధికారి అంతగల్ల మోగిలిపాక రాంచందర్ కార్యవర్గం సభ్యులు అశోక్, జోగు సుదర్శన్, కార్యదర్శి ఎరవెల్లి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

హెల్త్‌హబ్‌గా పీర్జాదిగూడ



మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రోజురోజుకూ నగరం అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్న క్రమంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఆస్పత్రుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో పీర్జాదిగూడ హెల్త్‌హబ్‌గా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులపై మరింత భారం పెరిగిందని, రోగులు, వారి కుటుంబ సభ్యులు డాక్టర్లను దేవుళ్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. వైద్య వృత్తికి వన్నె తేవడంతో పాటు నగర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

అవయవదానంపై అవగాహన



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాష్యం బ్లూమ్స్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అవయవదానం, మంట లేకుండా వంట చేయడం, వ్యర్థాలతో కళాత్మక వస్తువులు తయారు చేయడంపై స్థానిక ఆనందమయి అపార్ట్‌మెంట్‌లో అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అపార్ట్‌మెంట్ వాసులు, భాష్యం బ్లూమ్స్ విద్యాసంస్థల సీఈఓ చైతన్య, జోన్–2 డీన్ అర్చన, పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి, ఉపాధ్యాయులు ఉన్నారు.

దుర్గానగర్‌లో విషాదఛాయలు



లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: అరుణాచల్ ప్రదేశ్‌లో ఆర్మీకి చెందిన ఛేతక్ హెలికాప్టర్ కూలిన ఘటనలో విధి నిర్వహణలో ఉన్న మల్కాజిగిరి దుర్గానగర్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి(ఉప్పల వినయ్‌భాను రెడ్డి) మృతి చెందిన విషయం తెలుసుకొని పెద్ద ఎత్తున ఇంటి వద్దకు చేరుకున్న పలువురు అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. దుర్గానగర్‌వాసులు అతడి ఇంటి వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కంటి వెలుగు



కంటి వెలుగు కార్యక్రమంలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 5వ డివిజన్ ఐఏసిటీ కాలనీలో రెండో విడత కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరం ఉన్నవారు కళ్లద్దాలు తీసుకోవాలన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు పొందని వారికి ఇంటికి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

మిలటరీ హోటల్‌లో సినీతారల సందడి



హోటల్‌ను ప్రారంభిస్తున్న నటుడు విశ్వక్‌సేన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టాలీవుడ్ సినీతారలు హీరో విశ్వక్ సేన్, అల్లరి నరేశ్, డైరెక్టర్ అనిల్ రావిపుడి, డైరెక్టర్ హను రాఘవపూడి, నటులు శత్రు శుక్రవారం సైనిక్‌పురిలో సందడి చేశారు. సైనిక్‌పురి వేదికగా 1980 నాటి మిలిటరీ హోటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీరు హోటల్‌లోని పలు విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. విభిన్న ఆహార రుచులకు హైదరాబాద్ అడ్డాగా మారిందన్నారు. 1980 కాలం నాటి రుచులకు ఈ మిలిటరీ హోటల్ కేంద్రంగా నిలుస్తుందని హీరో అల్లరి నరేశ్ తెలిపారు. నలభై ఏళ్ల క్రితం ఉపయోగించిన సుగంధ ద్రవ్యాలతో సంప్రదాయ దక్షిణ భారతీయ వంటకాలను తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ పాస్టర్స్ ఫెలోషిప్ చర్చి ప్రతినిధి రాజు జన్మదిన సందర్భంగా త్రినిటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఆదర్శనగర్ జమ్మిగడ్డలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్, పాస్టర్లు, రాజు, డానియల్, జయపాల్, రాజు, జ్యోతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.